## క్లుప్తంగా

### రాతపుస్తకాలు, పెన్నులు అందజేత



పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక, ఎస్సీ కాలనీ ప్రాథమిక, బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ టీచర్ రాఘవరెడ్డి జ్ఞాపకార్థం ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం నోటు పుస్తకాలు, పెన్నులు వారి సతీమణి ఇందిరమ్మ అందజేశారు. ఆయా పాఠశాలల్లోని మొత్తం 500 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను అందజేశారు. పేద విద్యార్థులకు తమ వంతుగా ప్రతి సంవత్సరం తోడ్పాటునందిస్తామన్నారు.

### కవర్లలో సారవంతమైన మట్టి నింపాలి



పాన్‌గల్: మొక్కల పెంపకానికి కవర్లలో నింపే మట్టిని సారవంతమైన మట్టిని నింపాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి ఉపాధి సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని బండపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీని సందర్శించి కవర్లలో నింపే మట్టిని, కవర్లను పరిశీలించారు. కవర్లలో నింపే మట్టిని జల్లెడ పట్టి నింపాలన్నారు. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో నాటిన మొక్కలకు పాదులు తీసి క్రమం తప్పకుండా నీటిని పట్టాలని సూచించారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య 50కి తగ్గకుండా పనులకు వచ్చేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

### పందులను గ్రామానికి దూరంగా తరలించండి



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో పందులు విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పట్టణంలో ఓ కౌన్సిలర్ ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం, అతడు మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్నిహితంగా ఉండటంతో పట్టణంలో ఎవరూ ఫిర్యాదు చేసిన పట్టించుకోవట్లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో మటన్, చేపల మార్కెట్‌కు అతి సమీపంలో స్థానిక కౌన్సిలర్ నివాసం ఉండటంతో పందులు అక్కడే విచ్చలవిడిగా ఉండటంతో మటన్, చేపలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పందులను శివారు ప్రాంతాలకు తరలించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

### రోడ్లపైనే పంట నూర్పిళ్లు



గోపాల్‌పేట: బీటీ రోడ్లపై కొందరు రైతులు వడ్లు ఆరబెడుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వడ్లను ఆరబెట్టే సమయంలో వాటి పక్కన రాళ్లు పెడుతుండడంతో వాహన ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. దీనిపై అధికారులు రైతులకు అవగాహన కల్పించి రోడ్లపై వడ్లు ఆరబోయకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో అక్కడక్కడా ఇలా ఆరబోస్తున్నారని పోలీసులు వారికి అవగాహన కల్పించి కల్లాలు లేదా ఇతర ఖాళీ స్థలాల్లో వడ్లు ఆరబోసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

### శిలాఫలకం కూల్చివేత

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లిలో కాంగ్రెస్ నాయకులు తమ పార్టీ గెలుపొందిన వెంటనే గ్రామంలో ఓ బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని కూల్చివేశారు. ఆదివారం వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేఘారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించి గ్రామ సర్పంచ్ ఇంటి వద్ద బాణసంచా కాల్చి కాంపౌండులోకి వేశారు. అంతటితో ఆగకుండా గ్రామం నుంచి మద్దిగట్లకు వెళ్లే మట్టి రోడ్డును రూ.1.80 కోట్ల నిధులతో బీటీ రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేసి మంత్రి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# కల్లాల్లోనే ధాన్యం

- కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా.. ఇంకా కొనని వైనం
- కమ్ముకుంటున్న మబ్బులు
- ఆందోళనలో అన్నదాతలు



కంచిరావుపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెట్టిన రైతులు

పెబ్బేరు రూరల్: ఉమ్మడి పెబ్బేరు మండలంలో వరికోతలు ప్రారంభమయ్యాయి. కోతలు జోరందుకున్నప్పటికీ ధాన్యం కొనుగోళ్లు మాత్రం ప్రారంభం కాలేదు. కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిసున్నప్పటికీ తూకం వేసి, మిల్లులకు పంపించే ప్రక్రియ ప్రారంభించకపోవడంతో రైతుల్లో నిరాశ నెలకొంది. దీంతో రైతులు తీవ్రంగా గుబులు చెందుతున్నారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారడంతో అకాల వర్షాలు కురిసి పంటకు నష్టం కలిగే అవకాశాలున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ధాన్యాన్ని గన్నీ సంచుల్లో నింపి, హమాలీలతో లారీల్లో లోడ్ చేయించి మిల్లులకు పంపే వరకూ గ్యారెంటీ లేని పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మటుకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను గుర్తించడంతోనే సరిపెట్టడంతో ఎప్పటి వరకు ప్రారంభమవుతాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఐకేపీ ద్వారా పెబ్బేరు మండలంలో పెంచికలపాడు, గుమ్మడంతండా, పాతపల్లి, రాంపురం, రంగాపురం, కంచిరావుపల్లి, ఈర్లదిన్నె, తిప్పాయిపల్లిలో సింగిల్ విండో ద్వారా శ్రీరంగాపురం మండలంలోని శ్రీరంగాపురం, వెంకటాపురం, జానంపేట, నాగసానిపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను మాత్రమే ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తరలిస్తున్నారు. మిగతా చోట ప్రభుత్వం త్వరగా కొనుగోలు కేందాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాని కోరారు.

### 40 రోజుల క్రితం

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో నేను కేంద్రంలో 40 రోజుల కింద ధాన్యం ఆరబోశాను. ధాన్యం ఎండిన కొనేవారు లేరు. మబ్బులతో భయం వేస్తుంది. ధాన్యాన్ని రోజూ ఆరబెట్టి టార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచుతున్నాం. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేసి ధాన్యం సేకరించాలి.

– కుమ్మరి చంద్రశేఖర్, రైతు సూగూరు

### మబ్బులతో ఆందోళన

కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తొందరగా కొనుగోలు చేయాలి. వాన మబ్బులు ఉండడంతో ధాన్యం ఆరడం లేదు. ప్రభుత్వం తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోలు చేయాలి. రైతులకు టార్పాలిన్ కవర్లు అందించి ఆదుకోవాలి.

– దేవదాసు, రైతు, వెంకటాపురం

# ఆత్మకూర్‌లో మెగా రక్తదాన శిబిరం

ఆత్మకూర్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంవీరామన్ పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 64 మంది రక్తదానం చేశారు. ఎంవీ రామన్ విద్యా సంస్థ చైర్మన్, మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈసందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ యువకులు పెద్ద ఎత్తున రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. విద్యార్థులు ఆట, పాటలతో అలరించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఖాజాకుత్బుద్దీన్, డాక్టర్ తిరుమలేష్, కలాంపాష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తిరుమలేష్‌ను మెమొంటోతో సత్కరిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్

### 32వ సారి రక్తదానం

ఎంవీరామన్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ తెలుగు తిరుమలేష్ 32వ సారి రక్తదానం చేసి ప్రశంసలు అందుకున్నారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ ఖాజాకుత్బుద్దీన్ తదితరులు తిరుమలేష్‌ను శాలువాతో సన్మానించి మెమొంటో అందజేశారు.

## నిరుపయోగంగా భవనాలు

పెద్దకొత్తపల్లి: మండలంలని కల్వకోల్‌లో రూర్బన్ మిషన్‌లో భాగంగా ఏడాది కిందట మీసేవా కేంద్రం, గ్రంథాలయ భవన కేంద్రం నిర్మించారు. రూ.7.50 లక్షలు నిధులు వెచ్చిం మీసేవా కేంద్ర భవనం, రూ.2లక్షలు గ్రంథాలయ భవనం నిర్మించి వృథాగా వదిలేశారు. కొత్త భవనాలలో నిర్మించారు కాని ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.లక్షలతో భవనాలు నిర్మించి ప్రజాధనం వృథా అయ్యాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని నిర్మించిన భవనాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# పూడుకుపోతున్న చెరువు కాల్వ

అమరచింత: 15ఏళ్ల కిందట అమరచింత పెద్ద చెరువును లిఫ్టు నీటితో నింపి ఆయకట్టుకు సాగునీరును అందించాలనే సంకల్పంతో నిర్మించిన చెరువు కాల్వ నేడు పూడుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అమరచింత లిఫ్ట్ నుంచి పెద్ద చెరువును నీటితో నింపాలని అప్పట్లో ఎంపీ విఠల్‌రావు, ఎమ్మెల్యే స్వర్ణమ్మ నిధుల ద్వారా కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు. వీటితో పాటు పనికి ఆహారం పథకం ద్వారా మరోమారు నిధులు మంజూరు కావడంతో పూర్తి స్థాయిలో కాల్వను నిర్మించారు అమరచింత రైతులు, అఖిలపక్ష నాయకులు. కానీ 15 ఏళ్లుగా లిఫ్టు నుంచి చెరువు కాల్వకు సాగునీరు వదలకపోవడం, ఐడీసీని తొలగించి ఇరిగేషన్ శాఖకు అప్పగించడంతో వీటి నిర్వహణ మరిచిపోయారు. దీంతో కాల్వలో భారీ చెట్లతో పాటు ముళ్లపొదలు పెరిగి కాల్వను కమ్ముకున్నాయి. సాగునీటి కోసం ఖర్చుపెట్టిన సుమారు రూ.20 లక్షలు మట్టిలో కలిసిపోయాయని రైతన్నలు వాపోతున్నారు.



అమరచింత శివారులో చెరువుకు నీటిని తరలించే కాల్వలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

## ప్రమాదకరం కల్వర్టులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులపై గతంలో నిర్మించిన కల్వర్టులు వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇటిక్యాల నుంచి చాగాపురం, ఉదండాపురం నుంచి ఇటిక్యాల, ఎర్రవల్లిచౌరస్తా నుంచి గార్లపాడు వెళ్లే రోడ్లపై పలు కల్వర్టులు వర్షాల కారణంగా కూలిపోయి ఏండ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదు. ఈ దారుల గుండా పదుల సంఖ్యలో గ్రామాలు ఉండటం వల్ల ఆయా రోడ్లు ప్రతి రోజు రద్దీగా ఉండటంతో ఎక్కడో ఒకచోట కల్వర్టులపై ప్రమాదాలకు గురవుతున్నారు. గార్లపాడు, సాసనూలు, షేకుపల్లి, చాగాపురం, ఇటిక్యాల గ్రామాల సమీపంలో కల్వర్టులు కూలిపోయిన ప్రదేశంలో ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు బిక్కు బిక్కుమంటూ నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలిపోయిన కల్వర్టులకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



సాసనూలు దగ్గర గుంతలు పడి కూలిపోయిన కల్వర్టు

## బీజేపీ సంబరాలు

కొల్లాపూర్: మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బాణాసంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా దళితమోర్చా రాష్ట్ర కార్యదర్శి జలాల్ శివుడు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు ముందు సెమీఫైనల్స్‌గా భావించే ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో విజయం సాధించడంతో పాటు, తెలంగాణలో 8 స్థానాల్లో గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపునకు ఈ ఎన్నికలే నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలుచేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాపోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కడ్తాల కృష్ణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు రమేష్, మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్, నాయకులు కాశీపురం మహేష్, ఎల్లయ్య, మెంటె శివకృష్ణ, చరణ్, కురుమయ్య, జగపతిరావ్, పరమేష్, చంద్రశేఖర్‌రావు, బొమ్మరిల్లు భాస్కర్ తదితరులున్నారు.



సంబరాల్లో బీజేపీ నాయకులు

# విద్యార్థులకు అర్థమయ్యేలా..

పెబ్బేరు రూరల్: విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో పాఠాలు అర్థమయ్యేలా బోధన ఉండాలని మండల ఎంఈఓ జయరాములు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాలు సులువుగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాల బోధన జరగాలన్నారు. ఉపాధ్యాయులు మోడల్ లెసన్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హెచ్‌ఎం సత్యనారాయణ, నారాయణ, మోహన్‌రాజు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెబ్బేరులో మాట్లాడుతున్న ఎంఈఓ జయరాములు

### విద్యా సామర్థ్యాల పెంపుపై శిక్షణ

వీపనగండ్ల: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాల పెంపుపై కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు సోమవారం మండల కేంద్రంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గణితం, ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల్లో అవసరమైన పరిజ్ఞానాన్ని కలిగి ఉంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించగలుగుతామని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె, వీపనగండ్ల, పుల్గర్‌చర్ల, రంగవరం, కల్వరాల గ్రామాల ప్రాథమిక పాఠశాలలు, అప్పర్ ప్రైమరీ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో సీఆర్పీ వెంకటేష్ పాల్గొన్నారు.



వీపనగండ్లలో..

## ఇళ్ల మధ్యనే విద్యుత్ లైన్



పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్‌లో ఇళ్ల మధ్య విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సీసీ రోడ్డు మధ్య పైభాగంగా 11 కేవీ విద్యుత్ వైర్ లైన్ వెళ్లడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లైన్ మార్చాలని ఆ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులకు బిల్లుల వసూలుపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపైన లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 11 కేవీలైన్‌ను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# తుపాను ప్రభావంతో రైతుల్లో ఆందోళన

పాన్‌గల్: తుపాను ప్రభావంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ఎప్పుడు అకాల వర్షాలు సంభవించి ధాన్యానికి నష్టం జరుగుతుందోనని రైతులు దిగులు చెందుతున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం అకాల వర్షాలకు నష్టం జరగకుండా ధాన్యాన్ని కవర్లతో కప్పి ఉంచి జాగ్రత్తలు పడుతున్నారు. దీంతో పాటు వాతావరణంలో వచ్చిన మార్పులతో ఎండలు లేకపోవడంతో తేమ శాతంలో మార్పులు వచ్చే అవకాశం ఉండటంతో ధాన్యాన్ని మళ్లీంల ఆరబెట్టాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో జాప్యం లేకుండా ధాన్యాన్ని సేకరించాలని రైతులు కోరుతున్నారు.




పాన్‌గల్ కొనుగోలు కేంద్రంలో కవర్లతో కప్పి ఉంచిన ధాన్యం

# శిథిలావస్థలో నీటి ట్యాంకు

- ఓవర్ ఫ్లో ద్వారా నీటి వృథా
- దెబ్బతింటున్న రహదారులు
- పట్టించుకోని అధికారులు

అమరచింత: పట్టణంలోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరువలో ఉంది. స్థానిక దశమి కట్ట వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా ప్రతినిత్యం ఓవర్‌ఫ్లో ద్వారా తాగునీరు వృథాగా పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేక పోతున్నారు. దీంతో ట్యాంకు లోంచి నీరు రోడ్లపై పారుతుండటంతో రహదారులు దెబ్బతింటున్నాయి. విషయాన్ని మున్సిపల్ అధికారులకు, పాలక వర్గానికి తెలిసిన అరికట్టలేకపోతున్నారు. స్థానిక జెడ్పీఉన్నత పాఠశాల, దశమికట్ట వద్ద ప్రతి నిత్యం వాటర్ ట్యాంకులు నిండుకొని నీరు రోడ్లపై పారుతున్నా మిషన్ భగీరథ అధికారులు, స్థానిక వాటర్ లైన్‌మెన్లు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోని నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.



దశమికట్ట వద్ద ట్యాంకు నిండి వృథా అవుతున్న తాగునీరు

# అవినీతి రహిత పాలన అందిస్తాం



వనపర్తిలో మాట్లాడుతున్న సతీష్, చందర్



కొత్తకోటలో..

వనపర్తి టౌన్: నియోజకవర్గంలో దోపిడీ, అవినీతి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు కాంగ్రెస్ నుంచి పోటీ తూడి మేఘారెడ్డిని గెలిపించారని కాంగ్రెస్ అసెంబ్లీ సమన్వయ కర్త ఎల్.సతీష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్ అన్నారు. వనపర్తిలో అవినీతి రహిత పాలన అందించేందుకు కాంగ్రెస్ శ్రేణులు, రాష్ట్ర నాయకత్వం సంసిద్ధంగా ఉందని తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని మేఘారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో అవినీతి పేరుకపోవడం వల్లే పట్టణ ప్రజలు 5వేల పై చిలుకు మెజార్టీతో కాంగ్రెస్ వైపు నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటేష్, బ్రహ్మం, చీర్ల సత్యం, విభూది నారాయణ, జయసుధ మధుగౌడ్, సుమిత్ర యాదగిరి, బండారు రాధాకృష్ణ, లక్ష్మి, రవి, కోఆప్షన్ సభ్యులు ఖైరున్ బేగం తదితరులు పాల్గొన్నారు.

### వాల్మీకులను అవమానించినందుకే..

వాల్మీకులను అవమానించినందుకే మంత్రి నిరంజన్‌రెడ్డి ఓటమిపాలయ్యారని కాంగ్రెస్ నాయకులు మురళీ, మండ్ల దేవన్ననాయుడు అన్నారు. పాత మున్సిపాలిటీలో ఉన్న వాల్మీకి విగ్రహాన్ని పాలిటెక్నిక్ ఎదుట మేఘారెడ్డితో కలిసి ప్రతిష్ఠిస్తామన్నారు. కార్యక్రమంలో రాములు, మహేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: నియోజకవర్గంలో అహంకారానికి ఆత్మగౌరవానికి జరిగిన ఎన్నికల్లో ఆత్మగౌరవమే గెలిచిందని మాజీ ఎంపీపీ వెంకటయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, బాలకృష్ణారెడ్డి, సతీష్‌కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పాలకులు అహంకారంతో ప్రజల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంతో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, బాలకృష్ణారెడ్డి, సతీష్‌కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 'ఆరు గ్యారెంటీ'లు అమలు చేస్తాం

పెబ్బేరు రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుందని వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం పట్టణ అధ్యక్షుడు కారుపాకుల వెంకట్రాములు ఆధ్వర్యంలో పెబ్బేరు పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వనపర్తికి నూతనంగా ఎన్నికైన శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి అభినందన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జిలు శ్రీనివాసులు, లక్ష్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్‌సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంధం రంజిత్, భానుప్రకాష్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, రవీందర్‌నాయుడు, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలాన్ని అభివృద్ధిలో ముందుంచేలా ఎమ్మెల్యే మేఘారెడ్డి కష్టపడతారని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం వారు మాట్లాడుతూ తూడి మేఘారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఉమ్మడి గోపాల్‌పేట ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు శివన్న, ఉపాధ్యక్షుడు నాగశేషి, సీనియర్ నాయకుడు శేఖర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, బాలపీరు, సుధాకర్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగుల సంబరాలు

కొత్తకోట రూరల్: దేవరకద్ర ఎమ్మెల్యేగా జి.మధుసూదన్‌రెడ్డి విజయం సాధించడంతో దివ్యాంగుల సంఘం రాష్ట్ర నాయకులు వేముల హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి తరహాలో రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, కుర్మయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు బాగు చేయండి



అడ్డాకుల: మూసాపేట మండలంలోని నందిపేట నుంచి దేవరకద్ర మండలంలోని జీనగరాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై బీటీ తేలిపోవడంతో పాటు రోడ్డుపై అడుగుకోగుంత ఏర్పడింది. నందిపేట నుంచి జీనగరాల వరకు సుమారు 3.5కిలోమీటర్ల దూరం ఉన్న బీటీరోడ్డు పూర్తి గుంతలమయంగా మారింది. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లడానికి ఇబ్బంది ఎక్కువైంది. గుంతలతో పాటు రోడ్డు నిండా కంకర తేలడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. నందిపేటతో పాటు అడ్డాకుల మండలంలోని రాచాల, పొన్నకల్, దుబ్బపల్లి, కందూర్, శాఖాపూర్, మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి గ్రామస్తులు ఇదే దారిలో దేవరకద్రకు రాకపోకలు సాగిస్తారు. ఈనేపథ్యంలో నందిపేట–జీనగరాల రోడ్డును బాగు చేయించాలని ప్రయాణీకులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కోయిల్‌కొండ: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఎస్.కృష్ణా ఆసియా ప్రెసిడెంట్ కప్ టార్గెట్‌బాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఎస్‌ఐ విజయ్‌భాస్కర్, సర్పంచ్ కృష్ణయ్య విద్యార్థిని శాలువాతో సత్కరించి అభినందించారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో కోయిల్‌కొండ విద్యార్థి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుమ్మరిరాజు, ఖాజ, అప్పి, మోహిన్, నాజీమ్ ఉన్నారు.

## చల్లబడిన వాతావరణం

కొల్లాపూర్: అల్పపీడనం ప్రభావం కారణంగా పట్టణంలో సోమవారం రోజంతా చల్లటి గాలులు వీచాయి. ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉండటంతో చాలామంది ఇంటికే పరిమితం అయ్యారు. పనులను వాయిదా వేసుకున్నారు. రోడ్లపై వాహనదారులు పలుచగా కనిపించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరికోతలు ఉంటే నిలిపివేయాలని, ఇతర పంటలను సాగుచేస్తున్న వారు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సూచించారు.